క్లుప్తంగా

ప్రత్తికోళ్లలంక ఎంపీటీసీ రాజీనామా

ఏలూరు రూరల్ : ఏలూరు రూరల్ మండలం కొల్లేరు గ్రామం ప్రత్తికోళ్లలంక ఎంపీటీసీ బలే సత్యప్రసాద్ తన పదవికి మంగళవారం రాజీనామా చేశారు. తన రాజీనామా పత్రాన్ని జెడ్పీ సీఈఓకు అందజేశారు. వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామ చేశానని సత్యప్రసాద్ పేర్కొన్నారు. అనంతరం ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాస రాజును కలిశారు.

హెచ్‌సీ కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న ఏఆర్ ఏఎస్పీ, డీఎస్పీ

ఏలూరు టౌన్: ఏఆర్ హెచ్‌సీ తెల్లం చంద్రరావు అనారోగ్యంతో మంగళవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్ ఆదేశాల మేరకు పోలీస్ అధికారులు హనుమాన్‌నగర్ ప్రాంతంలో చంద్రరావు స్వగృహానికి వెళ్లి ఆయన భౌతికకాయం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. ఏఆర్ అదనపు ఎస్పీ ఎన్ఎస్ఎస్ శేఖర్ చేతులమీదుగా చంద్రరావు కుటుంబానికి రూ.25 వేలు, ఫ్లాగ్ ఫండ్ నుంచి రూ.25 వేలు, విడోఫండ్ నుంచి రూ.50 వేల చెక్‌లను అందజేశారు. చంద్రరావు కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శ్రీహరిరావు, అడ్మిన్ ఆర్ఐ భావనకుమార్, ప్లాటూన్ ఆర్ఎస్ఐ శంకర్, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు ఆర్ నాగేశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ శానం రమేష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

పారిశుధ్య పనుల పర్యవేక్షణ



డ్రైయినేజీ పరిస్థితిని పరిశీలిస్తున్న మాలతి

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏలూరు నగర హెల్త్ ఆఫీసర్ మాలతి అన్నారు. ప్రతిరోజూ ఉదయం 5 గంటల నుంచి నగరంలోని శానిటరీ సర్కిళ్ల పరిధిలో ఆకస్మిక తనిఖీ చేస్తున్నట్టు చెప్పారు. మంగళవారం నగరంలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను ఆమె తనిఖీ చేశారు. వన్‌టౌన్ 10వ డివిజన్‌లోని అగ్రహారం, కల్పనా థియేటర్ రోడ్డు, హాయ్ టీ సెంటర్ మెయిన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో దోమల నిర్మూలనకు ఫాగింగ్, మురుగు కాల్వలు, కల్వర్టల కింద, ఖాళీ స్థలాల్లో నీటి నిల్వలు ఉన్న ప్రాంతాల్లో ఆయిల్‌బాల్స్ వేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో మలేరియా ఇన్‌స్పెక్టర్ దత్తి వేణుగోపాల స్వామి, మలేరియా సూపర్‌వైజర్ డి.దుర్గారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు, ఆరోగ్య కార్యదర్శి, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

తాగి వాహనాలు నడిపితే జైలుకే

ఏలూరు టౌన్: మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలు శిక్ష లేదా రూ.10 వేలు జరిమానా విధిస్తారని ఎస్పీ కె.ప్రతాప శివకిషోర్ హెచ్చరించారు. ఏలూరు రూరల్ ఎస్సై రాజారెడ్డి ఈ నెల 28న డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మాదేపల్లి గ్రామానికి చెందిన తుంపాల రాంబాబు అనే వ్యక్తి మద్యం సేవించి వాహనం నడుపుతుండగా పరీక్షించి అతనిపై కేసు నమోదు చేశారు. మంగళవారం ఏలూరులో న్యాయమూర్తి ముందు హాజరుపరచగా రాంబాబుకు 10 రోజుల జైలు విధిస్తూ తీర్పు చెప్పారు. ఈ సందర్భంగా రూరల్ ఎస్సై రాజారెడ్డి మాట్లాడుతూ ప్రతిరోజూ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నామని, మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవన్నారు. రూ.10 వేలు జరిమానా విధిస్తారని లేదా జైలుకు వెళ్లాల్సి ఉంటుందని హెచ్చరించారు.

ఏలూరు నగరం.. రోడ్లు అధ్వానం

- పట్టించుకోని అధికారులు
- ప్రజలకు అవస్థలు



గన్‌బజార్ ఏరియా సమీపంలో పాడైన ప్రధాన రోడ్డు

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో వర్షాలు పడితే పలు రోడ్లపై వెళ్లేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో ఎమ్మెల్యేగా ఆళ్ల నాని ప్రధాన పలు ప్రధాన రహదారులను అభివృద్ధి చేసినా, ఇంకా కొన్ని రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. అటువైపు వెళ్లాలంటేనే ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగా పాడైన రోడ్లను యుద్ధప్రాతిపదికన బాగుచేయాలని ప్రజలు కోరుతున్నారు. ఇటీవల స్వయంగా ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) సైతం పలు ప్రాంతాల్లో పర్యటించి అక్కడి రోడ్ల దుస్థితిని పరిశీలించి, వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించినా, అధికారులు మాత్రం దానిపై దృష్టి సారించలేదనే విమర్శలు వస్తున్నాయి.

వర్షం పడితే చిత్రమే

ఏలూరు 44వ డివిజన్ నూకాలమ్మ గుడి, గన్‌బజార్ ఆంజనేయ స్వామి గుడి సమీపంలో చిన్నపాటి వర్షానికే రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. ఏలూరు శాంతినగర్ ప్రాంతంలో, వన్‌టౌన్ మారుతీనగర్, తూర్పువీధి, పత్తేబాద, తంగెళ్లమూడి తదితర ప్రాంతాల్లో రోడ్లపై గోతులు ఏర్పడ్డాయి. ఈ గోతుల్లో వర్షపునీరు చేరి వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో ప్రయాణించేవారికి కష్టాలు వర్ణనాతీతం. ఈ రోడ్లను అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించటంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ఏలూరు శాంతినగర్ ఏరియాలో అధ్వానంగా మారిన రోడ్డు



ఏలూరు వన్‌టౌన్ తూర్పువీధి ప్రాంతంలో రోడ్ల దుస్థితి

మరమ్మతులు చేపట్టాలి



ఏలూరు నగరంలో ప్రాంతంలోని పలు చోట్ల రోడ్లు పాడైపోవటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు పడితే రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోవటం, రోడ్లన్నీ గోతులమయంగా ఉండడం వల్ల వాహనదారులు ప్రమాదాల బారిన పడే పరిస్థితి ఏర్పడింది. రోడ్లు, డ్రెయినేజీలను మరమ్మతులు చేయాలని అధికారులను కోరుతున్నా పట్టించుకోవటం లేదు. – గొంతిన రామకృష్ణ, ఏలూరు కొత్తపేట

ఇబ్బందులు లేకుండా చూడాలి



ఏలూరు నగరంలోని ప్రధాన రహదారులను వైఎస్సార్ సీపీ హయాంలో అభివృద్ధి చేశారు. రెండేళ్లు కరోనా కావటంతో రోడ్లు అభివృద్ధికి ఆటంకం ఏర్పడింది. చాలా వరకు రోడ్లు బాగు చేసినా, ఇంకా పలు రోడ్లు గోతులమయంగా మారాయి. వీటికి కొత్త ప్రభుత్వం మరమ్మతులు చేయాలి. ప్రజలకు వర్షాకాలంలో ఇబ్బందులు లేకుండా తాత్కాలికంగా అయినా బాగుచేయాలి. – మేతర సురేష్, ఏలూరు టూటౌన్

'పీఎం కిసాన్' నుంచి కొల్లేరు సాగుదారుల తొలగింపు



సమావేశం నిర్వహిస్తున్న ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు



సమావేశానికి హాజరైన సభ్యులు, అధికారులు

ఏలూరు రూరల్ : కొల్లేరు భూముల్లో సాగుదారులను పీఎం కిసాన్ పథకం నుంచి ప్రభుత్వం తొలగించిందని ఏలూరు మండల వ్యవసాయ అధికారిణి జీవనసంధ్య తెలిపారు. ఏలూరు మండల పరిషత్ సర్వసభ్య ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. సమావేశంలో ఏఓ జీవనసంధ్య మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో కొల్లేరులో వ్యవసాయ సాగుదారులు పీఎం కిసాన్ పథకం కింద రుణం అదుకున్నారని, ఇప్పుడు రుణం ఎందుకు రావడంలేదని ఎంపీపీ శ్రీనివాసరాజు ప్రశ్నించగా, కొల్లేరులో వ్యవసాయ భూములు ఆక్వాజోన్ పరిధిలో ఉండడంతో ప్రభుత్వం రైతులను పీఎం కిసాన్ నుంచి తొలిగించిందని ఏఓ జీవనసంధ్య తెలిపారు. వ్యవసాయ భూముల్లో సాగు చేసుకుంటున్న వారికే పీఎం కిసాన్ వర్తిస్తుందని చెప్పారు. కొల్లేరులో వ్యవసాయ భూములు ఆక్వాజోన్ పరిధిలో ఉన్నప్పటికీ గత ప్రభుత్వం రైతులకు రుణాలు ఇచ్చిందని ఎంపీపీ గుర్తుచేశారు. ఎంఈఓ రంగయ్య మాట్లాడుతూ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆదేశాల మేరకు గ్రామాల్లో ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.1.72 కోట్లతో ప్రణాళిక రూపొందించామన్నారు. ఇందులో ప్రభుత్వ పాఠశాలలకు రూ.105.47 లక్షలు, ఎయిడెడ్ పాఠశాలలకు రూ.67.2 లక్షలుగా నిర్ధారించామని తెలిపారు.

2,059 మందికి ఇళ్ల స్థల పట్టాలు

గత ప్రభుత్వ హయాంలో 2,059 మంది పేదలకు ఇళ్ల స్థల పట్టాలు అందిమచామని తహసీల్దార్ కార్యాలయ సూపరింటెండెంట్ నాగమణి తెలిపారు. ఇప్పటి వరకు పేదల ఇళ్ల స్థలాల కోసం 79 ఎకరాలు పంపిణీ చేశామని చెప్పారు. ఇందులో 35.50 ఎకరాలు భూమి ఉండగా, మరో 43.53 ఎకరాల భూమిని గత ప్రభుత్వం కొనుగోలు చేసిందని వివరించారు. పేదలకు స్థలాలు పంపిణీ చేయగా నేటికీ 647 స్థలాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఫిషరీస్, అటవీ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర శాఖల అధికారులు గత ప్రభుత్వం జరిగిన అభివృద్ధిని వివరించారు. సమావేశాన్ని ఎంపీడీఓ బి.ప్రణవి పర్యవేక్షించారు. జెడ్పీటీసీ మండల సరస్వతి, ఎంపీటీసీలు కాకర్ల తంబి, మోరు రజని, గోడిగడ్డ కుమారి, బొమ్మవరపు మణెమ్మ, బలే సత్యప్రసాద్, మండల శైలజ, సర్పంచ్‌లు గుడిపూడి రఘు, పత్యాల సునీత తదితరులు హాజరయ్యారు.

ఎస్సీ సర్పంచ్‌లకు న్యాయం చేయాలి

ఏలూరు (టూటౌన్): ఎస్సీ సర్పంచ్‌ల హక్కులకు ఆటంకం కలిగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ఎస్సీ సర్పంచ్‌ల హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మెండెం సంతోష్‌కుమార్ కోరారు. ఈ మేరకు మంగళశారం కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఆ వివరాలను సంతోష్ కుమార్ ఏలూరులో వెల్లడించారు. రాష్ట్రంలోని 13,371 సర్పంచ్‌లలో సుమారు 4 వేల మంది ఎస్సీ సర్పంచ్‌లు ఉన్నట్టు చెప్పారు. సర్పంచ్‌ల ప్రొటోకాల్ విషయంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని, స్థానిక రాజకీయ నాయకులకు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఎస్సీ సర్పంచ్‌లకు న్యాయం చేయాలని సంతోష్ కుమార్ కోరారు.



ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్‌కు వినతి పత్రం అందిస్తున్న సంతోష్‌కుమార్

డీఈఎల్ఈడీ ఫీజులు చెల్లింపునకు షెడ్యూల్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): డిప్లమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈఎల్ఈడీ) 2023–25 రెగ్యులర్ బ్యాచ్‌కు 2వ సెమిస్టరు, 2021–23, 2022–24 బ్యాచ్‌లకు చెందిన అనుత్తీర్ణులైన అభ్యర్థులకు వచ్చే సెప్టెంబర్‌లో పరీక్షలు జరుగుతాయని, అందుకు పరీక్ష ఫీజు చెలించడానికి షెడ్యూల్‌ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ విడుదల చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం తెలిపారు. అభ్యర్థులు అపరాధ రుసుం లేకుండా ఆగస్టు 11 వరకూ ఫీజు చెల్లించవచ్చన్నారు. రూ.50 అపరాధ రుసుంతో ఆగస్టు 19 వరకూ ఫీజు చెల్లించవచ్చన్నారు. 4 నుంచి 6 సబ్జెక్టులకు రూ.150, 3 సబ్జెక్టులకు రూ.140, 2 సబ్జెక్టులకు రూ.120, ఒక సబ్జెక్టుకు రూ.100 పరీక్ష ఫీజుగా చెల్లించాలని సూచించారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	రద్దు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	41
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	23
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	21.45	4820	25
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	21.15	4822	27
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	28
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	24
ఏలూరు – జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	30
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	33
ఏలూరు – ఈసీఐఎల్	22.30	4814	19
ఏలూరు – తిరుపతి	16.00	4830	34

ఉధృతంగా ప్రవహిస్తున్న గుండేరు



దెందులూరు సైఫన్ వద్ద గుండేరు వాగు ప్రవాహం

దెందులూరు: గుండేరువాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. పది రోజులుగా కురుస్తున్న వర్షాలకు, ఎగువనున్న మండలాల నుంచి వస్తున్న వర్షపునీరు తోడై వాగు ప్రమాదకర స్థాయిలో ఉంది. సీతంపేట కాలువలో ముంపునగురై దెందులూరు సైఫన్ నుంచి రోడ్డు ప్రాంతానికి వర్షపునీరు వస్తోంది. మరో వైపు రైతులు, రైతు నాయకులు వర్షాలకు ముందే సైఫన్ వద్ద ముందస్తు చర్యగా ఇసుక బస్తాలను, రక్షణ చర్యగా ఏర్పాటు చేశారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు వెంటనే స్పందించి ఎటువంటి ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

అగ్రభాగాన నిలపడమే లక్ష్యం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రభాగాన నిలపడమే లక్ష్యంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. మంగళవారం స్థానిక పవర్‌పేటలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏలూరు కార్పొరేషన్ ఏఈలు, డీఈలు, ఎస్ఈలతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో నగర పాలక సంస్థ కో ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

మ్యాన్‌హోల్‌లో పడిన అంధుడు



అంధుడిని మ్యాన్‌హోల్ నుంచి బయటకు తీసిన స్థానికులు

ఏలూరు టౌన్: ఏలూరు నగరపాలక శానిటరీ సిబ్బంది నిర్లక్ష్యంతో ఒక అంధుడు మ్యాన్‌హోల్‌లో పడిపోయాడు. అతను మ్యాన్‌హోల్‌లో పడటం స్థానికులు గమనించడంతో వెంటనే వెళ్లి అతన్ని బయటకు తీశారు. ఏలూరు వన్‌టౌన్‌లో ఉదయం శానిటరీ సిబ్బంది మ్యాన్‌హోల్‌లోని చెత్తను తొలగించేందుకు మూతను తీసి టీ తాగేందుకు వెళ్లారు. ఈలోగా అటుగా నడుచుకుంటూ వెళ్తున్న మహ్మద్ ఖాజా అనే అంధుడు తెరిచి ఉన్న మ్యాన్‌హోల్‌లో పడిపోయాడు. స్థానికులు గమనించి అక్కడకు వెళికల ఖాజాను బయటకు తీశారు. నగర పాలక సిబ్బంది నిర్లక్ష్యంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

హైవేపై ప్రమాదాల నివారణకు చర్యలు

దెందులూరు: జాతీయ రహదారిపై ఆశ్రం– సోమవరప్పాడు బైపాస్ మధ్య వ్యాసగాని బ్రిడ్జి సమీపంలో భవిష్యత్తులో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ఎస్పీ కె.ప్రతాపశివకిషోర్ ఆదేశాల మేరకు దెందులూరు ఎస్సై కె.స్వామి చొరవ తీసుకుని చర్యలు ప్రారంభించారు. నేషనల్ హైవే అథారిటీ అధికారులను కలిసి అక్కడ ఉన్న సిమెంట్ రాళ్లను తొలగించి రేడియం స్టిక్కర్లు, రేడియం కోన్స్, డ్రమ్ములు, సైన్‌బోర్డులు, బారికేడ్లను ఏర్పాటు చేయించారు. సోమవారం తెల్లవారుజామున రాజ మండ్రి వైపు నుంచి విజయవాడ వైపు వెళ్తున్న మోటారుసైక్లిస్టు వ్యాసగాని బ్రిడ్జి వద్ద చీకట్లో కనపడక పక్కనే సిమెంట్ రాళ్లను ఢీకొట్టి తీవ్రగాయాలై మృతి చెందాడు.

ఉపాధి హామీ బకాయిలు చెల్లించాలి

ఏలూరు (టూటౌన్): ముంపు మండలాలైన వేలేరుపాడు, కుక్కునూరులో ముంపునకు గురైన గ్రామాలలో పేదలకు సంబంధించి ఉపాధి హామీ పనుల బకాయిలు తక్షణమే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు కోరారు. ఆర్‌ఆర్‌పేటలోని స్ఫూర్తి భవన్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. వేలేరుపాడు మండలంలో ప్రజలు సర్వస్వం కోల్పోయి అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉపాధి హామీ డబ్బులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేయడం చాలా బాధాకరమని పేర్కొన్నారు.

అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సమాజంలో మానవ అక్రమ రవాణా సర్వసాధారణంగా మారిందని, అపరిచిత వ్యక్తులతో బాలలు అప్రమత్తంగా ఉండాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ సూచించారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ మానవ అక్రమణ రవాణా దినోత్సవ సందర్భంగా స్థానిక సెయింట్ గ్జేవియర్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా రత్నప్రసాద్ మాట్లాడుతూ సంఘ విద్రోహ శక్తులు బాలలను అపహరించడమే కాకుండా వారితో సంఘవిద్రోహ పనులను చేయిస్తున్నారని, వెట్టి చాకిరి మొదలైన పనులు చేస్తున్నారని తెలిపారు. అటువంటి పరిస్థితులు ఎదురైనప్పుడు 1098కు లేదా జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ప్యానల్ లాయర్ కూన కృష్ణారావు, ట్రైనీ మాస్టర్ టి.సుబ్బారావు, సోషల్ వర్కర్ ఎం అజయ్ బాబు, ప్రధానోపాధ్యాయులు ఐ.రాజు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భోజన మెనూ అమలు తప్పనిసరి



స్టోర్ రూమ్‌ను పరిశీలిస్తున్న జేసీ ధాత్రి రెడ్డి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): మధ్యాహ్న భోజన పథకం ఆహార పదార్థాలను ప్రధానోపాధ్యాయులు పరిశీలించిన తరువాతే పిల్లలకు పెట్టాలని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి ఆదేశించారు. స్థానిక ఈదర సుబ్బమ్మదేవి నగరపాలక ఉన్నత పాఠశాలలో మంగళవారం మధ్యాహ్నం భోజన పథకాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. మెనూ ప్రకారంగా తప్పనిసరిగా ఆహారాన్ని విద్యార్థులకు అందించాని జేసీ ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు హాస్టల్స్, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో పిల్లలకు అందిస్తున్న కోడిగుడ్లు, పోర్టిఫైడ్ బియ్యం, తదితర వస్తువుల భద్రత విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలలో స్టోర్ రూమ్, వంటశాల, మధ్యాహ్నం భోజన పథకాన్ని, విద్యార్థినలు హాజరు రిజిస్టర్, స్టాక్ రిజిష్టరులను పరిశీలించారు. స్థానిక ద్వారకానగర్, తంగెళ్లమూడి 196వ నెంబరు అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణ, పిల్లలకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. అమీనాపేట నెం.1లోని ప్రభుత్వ సాంఘీక సంక్షేమ కళాశాల బాలికల వసతి గృహంలో బియ్యం నిల్వ ఉంచే గదిని, వంటశాలను పరిశీలించారు. జాయింట్ కలెక్టర్ వెంట ఐసీడీఎస్ పీడీ కె.పద్మావతి, బీసీ, సోషల్ వెల్ఫేర్ జేడీలు నాగమణి, జయప్రకాష్, డీఎం సివిల్ సప్లైస్ మంజుభార్గవి, డీఎస్ఓ ఆర్ఎస్ఎస్ రాజు, డీవైఈఓ ఎ.రవిప్రకాష్, డీఈఓ కార్యాలయ ఏసీ షరీఫ్, ఎంఈఓ ఆర్ రంగయ్య, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ రామరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల సంక్షేమానికి పోరాడుదాం



నినాదాలు చేస్తున్న యూనియన్ నాయకులు


ఏలూరు (టూటౌన్): ఆటో డ్రైవర్ల సంక్షేమానికి సమరశీల పోరాటాలు చేస్తామని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి జె.గోపి అన్నారు. స్థానిక పాతబస్టాండ్ సెంటర్ త్రిచక్రం ఆటో డ్రైవర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) అధ్యక్ష ఎన్నికలు స్థానిక ఆటో స్టాండ్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో గెలిచిన అడ్డాల రాజు (నాని)కి జిల్లా ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ సీఐటీయూ ప్రధాన కార్యదర్శి జె.గోపి, ఉపాధ్యక్షుడు చక్రాల అమర్ కుమార్ అభినందనలు తెలిపారు. ఆటో డ్రైవర్లకు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఇ చలానాలు రద్దు చేయాలని, రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. రవాణా రంగ కార్మికులకు ఉరితాడులా మారిన బీఎన్ఎస్ 106 (1, 2)లను కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కోలా రాజు, బి.త్రినాథ్, శివ, బొడ్డేపల్లి చంద్ర శేఖర్, మాత్రపు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత విషయాలను ఇతరులతో పంచుకోవద్దు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్సై విశ్వం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సోషల్ మీడియా ద్వారా పరిచయమయ్యే అపరిచిత వ్యక్తులకు యువతులు తమ వ్యక్తిగత విషయాలు తెలియనివ్వకూడదని ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ విశ్వం సూచించారు. ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాలపై మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ సున్న మురళీకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కోటదిబ్బగా ప్రభుత్వం జూనియర్ కళాశాలలో సోషల్ మీడియా మాధ్యమాల ద్వారా జరుగుతున్న అఘాయిత్యాలు, గంజాయి వాడకం, మహిళల పట్ల జరుగుతున్న అఘాయిత్యాలు, రోడ్డు ప్రమాదాల నివారణ, గురించి సోషల్ మీడియా మాధ్యమాల్లో జరుగుతున్న అక్రమాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థినులు గుడ్‌టచ్ బ్యాడ్‌టచ్, మహిళా చట్టాలపై అవగాహనను కలిగి ఉండాలన్నారు. ఆన్‌లైన్‌లో వచ్చే లింకులను గాని, మెస్సేజులకు గాని స్పందించవద్దని, అపరిచిత వ్యక్తులు పంపించే లింకులకు స్పందిస్తే తమ బ్యాంకులో ఉన్న నగదు తస్కరిస్తారని హెచ్చరించారు.



సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

ఏలూరు

99122 20559
95055 08399
79955 66352

Office mail : tpgadvt@gmail.com